‘మధు’పై ఆరోపణలు అవాస్తవం

- కాంగ్రెస్ నేతల ఆరోపణలపై జిల్లెల్ల గ్రామస్తులు నిరసన


జిల్లెల్లలోని అంబేద్కర్ వద్ద నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

సిరిసిల్ల రూరల్, మార్చి 8 : బీఆర్ఎస్ సీనియర్ నేత, జిల్లెల్ల మాజీ సర్పంచ్ మాట్ల మధుపై కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రవీణ్ చేసిన ఆరోపణలు అవాస్తవమని జిల్లెల్ల గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల క్రాసింగ్ లోని అంబేద్కర్ విగ్రహం ఎదుట కాంగ్రెస్ నేతల ఆరోపణలపై నిరసన తెలిపారు. అనంతరం యువకులు మాట్లాడుతూ, నిరుపేదల వైద్యం కోసం అన్నీ తానై హాస్పిటల్‌కు తీసుకుపోయి వారికి ఎల్లవేళలా అండగా ఉన్న వ్యక్తి మధు అంటూ పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకుల ఆరోపణలో వాస్తవం లేదన్నారు. దమ్ము ధైర్యం ఉంటే జిల్లెల్ల అంబేద్కర్ దగ్గరికి వచ్చి నిరూపించాలని సవాల్ విసిరారు. తమ గ్రామంలో పెద్ద చెరువు, పెచ్చెరువు, బచ్చెరువు ఎక్కడుందో తెల్వని మీరు మా గ్రామం గురించి మాట్లాడడం సిగ్గుచేటన్నారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డికి ఏం తెలియకున్నా పిచ్చి పనులకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. మా గ్రామంలోనే ఆ డైరెక్టర్‌కు సరైన సమయంలో సరైన గుణపాఠం తప్పక చెబుతామని హెచ్చరించారు. మాట్ల మధుపై అనవసర ఆరోపణలు చేస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో ఇట్టిరెడ్డి మహిపాల్ రెడ్డి, బొల్గం, రమేశ్, ఎర్ర సుమన్, బండి శ్రీనివాస్, చింతమడక శంకర్, సయ్యద్ అఫ్రోజ్, గొట్టం వంశీ, దాసరి వంశీ, బర్ల రాజు, పర్వతం రాజు, ఉడుతల అక్షయ్, అజయ్ పాల్గొన్నారు.

ఖబడ్దార్ కేకే

- గుండాగిరీకి భయపడేటోళ్లం కాదు... • కేటీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించం
- బీఆర్ఎస్ సీనియర్ నేత మాట్ల మధు

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ సీనియర్ నేత మాట్ల మధు

సిరిసిల్ల రూరల్, మార్చి 8 : సిరిసిల్ల అభివృద్ధి ప్రదాత మాజీ మంత్రి కేటీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తేనే హెచ్చరించానని, తనపై కాంగ్రెస్ గుండాగిరీ చేస్తున్నదని, వారి బెదిరింపులకు భయపడేటోళ్లం కాదని.. ఖబడ్దార్ కేకే అని బీఆర్ఎస్ సీనియర్ నేత మాట్ల మధు హెచ్చరించారు. తంగళ్లపల్లి మండల కేంద్రంలో శనివారం ఫ్రెండ్స్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందుగా మహిళలకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. తంగళ్లపల్లి కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జలగం ప్రవీణ్, సిరిసిల్లలో పలువురు కాంగ్రెస్ నేతలు తనపై వ్యక్తిగతంగా దూషించడాన్ని ఖండించారు. జిల్లెల్లలోని సామాన్య రైతు రాజిరెడ్డిపై అక్రమంగా కేసు పెట్టి జైలులో పెట్టించగా కేటీఆర్ అండగా ఉన్నారని అన్నారు. రాజిరెడ్డిని పరామర్శించే క్రమంలో రైతులు కేటీఆర్‌ను పొలాలకు నీరందించేలా చేయాలని విజ్ఞప్తి చేయగా, రంగనాయకసాగర్, మల్కపేట రిజర్వాయర్ నింపాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితోపాటు సంబంధిత అధికారులతో మాట్లాడి నీరు వచ్చేలా చేశారన్నారు. ఇది జీర్ణించుకోని కేకే మహేందర్‌రెడ్డి విలేకరుల సమావేశంలో కేటీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశాడని పేర్కొన్నారు. తమ నాయకుడు కేటీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడంతో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఖండించానన్నారు. మరోసారి కేటీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే అంబేద్కర్ ఎదుట బట్టలు ఊడదీసి తరిమికొడతామని హెచ్చరించింది వాస్తవమేనని, చెప్పుతో కొడతామని అనలేదన్నారు. దీనిపై కాంగ్రెస్ గూండాలు తనపై విచక్షణారహితంగా విరుచుకుపడి వ్యక్తిగతంగా దూషించారన్నారు. అంతే కాకుండా పలువురు ఫోన్లు చేసి బెదిరింపులకు పాల్పడ్డారన్నారు. కేకే మహేందర్‌రెడ్డి నీ చెంచాలు బెదిరిస్తే భయపడేది లేదన్నారు. కేటీఆర్‌పై ఐదుసార్లు ఓడిపోయి అదే అక్కసుతో బీఆర్ఎస్ నేతలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. మేం అధికారంలో ఉన్నప్పుడు చిల్లర పనులు చేయలేదని హుందాగా వ్యవహరించామన్నారు. గత సంవత్సరం రంగనాయక్‌సాగర్ ద్వారా పొలాలకు నీరిచ్చింది నీవే కాదా అని గుర్తు చేశారు. పార్టీకి సంబంధం లేని ఓ వ్యక్తిని జైలులో పెట్టించే సంస్కృతి మీదన్నారు. ఒకే పార్టీలో ఉన్నట్టుగా కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు ప్రవీణ్ సత్తెపూస మాటలు మాట్లాడడం సిగ్గుచేటన్నారు. నీ లెక్క డబ్బులు తీసుకుని పోటీలో నిలబడలేదని వార్డు మెంబర్‌గా గెలవని నువ్వా నా గురించి మాట్లాడేదని ప్రశ్నించారు. జడ్పీటీసీ టికెట్, పైసలు ఆశించి మా పార్టీలోకి వస్తానని చెప్పిన మాట మరిచావా అని అన్నారు. మండెపల్లిలో భూమిని ఆక్రమించుకోవడం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. నిమ్స్ దవాఖానలో అడుగు తన గురించి చెబుతారని, గ్రామంలో ఎవరికి వైద్య సహాయం కావాలన్నా అండగా ఉండానని తెలిపారు. కమీషన్ల ఆరోపణలను మా ఊరిలోకి వచ్చి నిరూపిస్తావా ? అని ధ్వజమెత్తారు. ఇసుక ట్రాక్టర్ల దగ్గర పైసలు తీసుకుని ఇడువకుంటే కేసులు పెట్టిస్తానని దాదాగిరి చేసింది నువ్వు కాదా? అని ప్రశ్నించారు. నువ్వు మనిషిలా కాకుండా మతిభ్రమించి మాట్లాడుతున్నావని అన్నారు. తమ గ్రామంలో డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణం చేస్తే ఆపింది మీ కాంగ్రెస్ నాయకులేనని తనపై ఆరోపణలు చేయడం సిగ్గు చేటన్నారు. కేకే ఇలాంటి చెంచాగిరిలను పోషించేది ఇందుకేనని అన్నారు. జిల్లెల్ల గ్రామం జిల్లాకే ఆదర్శమని కేటీఆర్ సహకారంతో వ్యవసాయ కళాశాల, గోదాములు, కోల్డ్ స్టోరేజ్ అభివృద్ధి పనులు చేశామన్నారు. 300 మందికి పట్టాలిప్పించి 50 మందికి ఇండ్ల పట్టాలు ఇప్పించానని, నీలాగా దోచుకుని పని చేయలేదన్నారు. నా ఊరు నాకు దేవాలయంలాంటిదని తాను నన్ని రోజులు గ్రామానికి సేవ చేస్తానని అన్నారు. నీ లాగా దోచుకోలేదని పైసలిచ్చినా తీసుకోలేదని పేర్కొన్నారు. వ్యవసాయ కళాశాలలో భూములు కోల్పోయిన దళితులకు అండగా నిలిచానన్నారు. నేరెళ్ల ఘటనలో కేటీఆర్‌కు సంబంధం లేకున్నా బాధితులకు కేటీఆర్‌తో మాట్లాడి అండగా నిలిచానని కచ్చితంగా దళితుల పక్షాన నిలబడి వారికి న్యాయం చేస్తామన్నారు. ఇప్పటికైనా వ్యక్తిగత దూషణలు మానుకుని సబ్జెక్టు మీద మాట్లాడాలని, కేటీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే బరాబర్ తరిమికొడతామని హెచ్చరించారు. రాబోయేది మా ప్రభుత్వమేనని కచ్చితంగా అందరి లెక్కలు సరిచేస్తామన్నారు. ఈ సమావేశంలో కుర్మ రాజయ్య, కడారి నవీన్ రెడ్డి, కొయ్యెడ రమేశ్, బండి జగన్, ప్రేమ్‌కుమార్, దొంతినేని చంద్రారావు, శ్రీధర్, చిరంజీవి, అమర్‌రావు, ఆత్మకూరి చంటియాదవ్, కర్నె బాలయ్య, కందుకూరి రామాగౌడ్, మల్లారపు నరేశ్, సతీశ్‌రెడ్డి, మీసాల కృష్ణ, కృష్ణారెడ్డి, సావనపల్లి పరశురాములు, శ్రీకాంత్‌రావు, మహేశ్, అఫ్రోజ్, గున్నాల చక్రపాణి, తిరుపతి, మహేశ్, చెన్నమనేని రాజేశ్వర్ రావు, తిరపతిరెడ్డి, నరేందర్ రెడ్డి, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద్‌లో విలేకరులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

‘భయభ్రాంతులకు గురి చేయొద్దు’

ముస్తాబాద్, మార్చి8:ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలపై ప్రశ్నిస్తే బెదిరించి భయభ్రాంతులకు గురిచేయడం సరికాదని, భయపడితే భయపడేవాళ్లం కాదని ముస్తాబాద్ పట్టణాధ్యక్షుడు ఎద్దండి నర్సింహారెడ్డి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీలం స్వామి, కేటీఆర్ సేన రాష్ట్ర అధ్యక్షుడు మెంగని మనోహర్ దళిత సంఘం నాయకుడు ముక్క మల్లయ్య అన్నారు. మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వ అసమర్థతను ప్రజల్లోకి తీసుకపోతున్న దళితబిడ్డ సర్పంచుల ఫోరం మాజీ జిల్లా అధ్యక్షుడు మాట్ల మధును ఫోన్ ద్వారా బెదిరించి, వ్యక్తిగతంగా దూషించడంపై మండిపడ్డారు. బీఆర్ఎస్ నాయకులను టార్గెట్ చేస్తూ రాయలసీమ తరహా గుండాయిజాన్ని, రౌడీయిజాన్ని తన అనుచరులకు నేర్పుతున్న కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డి తీరును ఖండించారు. కాంగ్రెస్ నాయకుల తీరును సిరిసిల్ల ప్రజలు గమనిస్తున్నారన్నారు. సామాజిక మాధ్యమాల్లో మహేందర్ రెడ్డి అనుచరులు ఇష్టం వచ్చినట్టుగా మాజీ మంత్రి కేటీఆర్ పైన అసభ్య పదజాలం హేయమన్నారు. పోలీసు అధికారులు ఇలాంటి వారిపై చట్ట రీత్యా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఇక్కడ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మల్లయ్య, బండి ఎల్లం, ఎండీ జహంగీర్, పల్లె సత్యం, పుల్లూరి శ్రీనివాస్, చిప్పలపల్లి ఆంజనేయులు, బాలచంద్రం, సంజీవ్, తుమ్మనపల్లి శేఖర్‌చారి పాల్గొన్నారు.

కంటి శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- డాక్టర్ కల్వకుంట్ల లక్ష్మణ్‌రావు

శిబిరంలో ఉచిత కంటి పరీక్షలు చేయించుకుంటున్న మహిళ

ముస్తాబాద్, మార్చి 8 : గ్రామీణ పాంతంలోని పేదలకు రూపాయి ఖర్చులేకుండా కల్వకుంట్ల రమాదేవి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆయ్యప్పస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరాన్ని మండల, పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని శిబిరం నిర్వాహకులు డాక్టర్ కల్వకుంట్ల లక్ష్మణ్‌రావు తెలిపారు. కంటి పరీక్షలతో పాటు వైద్యుల సూచన మేరకు అవసరం ఉన్నవారికి ఆపరేషన్లతోపాటు అద్దాలు ఇవ్వనున్నట్లు చెప్పారు. శిబిరానికి వచ్చేవారికి భోజన సౌకర్యం కల్పిస్తున్నామని ఆయన తెలిపారు.

బెదిరింపులకు భయపడేది లేదు

- మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్, బీఆర్ఎస్ నేత బూర నరేశ్

సిరిసిల్లలోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేత బూర నరేశ్

సిరిసిల్ల టౌన్, మార్చి 8: కాంగ్రెస్ నేతలు తమ నాయకుడి మెప్పు పొందేందుకు బీఆర్ఎస్ నాయకులను బెదిరింపులకు గురిచేస్తే భయపడే వారెవరూ లేరని మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్, బీఆర్ఎస్ నేత బూర నరేశ్ అన్నారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అభివృద్ధే ధ్యేయంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పనిచేశారని గుర్తుచేశారు. తమ గ్రామం రగుడులో జరిగిన అభివృద్ధే ఇందుకు నిదర్శనమన్నారు. రగుడు గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు వారి నాయకుడి మెప్పును పొందేందుకు బీఆర్ఎస్ నాయకులపై వ్యక్తిగతంగా ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. కాంగ్రెస్ నేత కేకే మహేందర్‌రెడ్డి తన అనుచరులతో బీఆర్ఎస్ నాయకుడు, మాజీ సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడు మాట్ల మధును బెదిరింపులకు పాల్పడడం సిగ్గుచేటన్నారు. స్థానికంగా గెలువలేని వ్యక్తి ఈ విధంగా చేస్తున్నారని ఆరోపించారు. కేటీఆర్, బీఆర్ఎస్ నాయకులను తిడితే ఎమ్మెల్యే అవుతానని అనుకోవడం మీ భ్రమేనన్నారు. కేకే.మహేందర్‌రెడ్డి తన జీవితంలో ప్రజాప్రతినిధి కాబోడన్నారు. తన చెంచాలతో మరోసారి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై ఇటువంటి చర్యలకు పాల్పడితే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. సమావేశంలో మున్సిపల్ మాజీ కౌన్సిలర్ పోచవేని ఎల్లయ్య, నర్మెట ప్రభుదాస్, గుగ్గిళ్ల అజయ్‌గౌడ్, తదితరులున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

చందుర్తి : చందుర్తి మండలం మల్యాల గ్రామంలోని కోరుట్ల–వేములవాడ ప్రధాన రహదారిలో కల్వర్టు మూలమలుపు వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్తుల కథనం ప్రకారం, మల్యాల గ్రామానికి చెందిన పోతరాజు గంగాధర్ చందుర్తి నుంచి మల్యాలకి వెళ్తుండగా, సనుగుల గ్రామం చెందిన శివరాత్రి రమేశ్ మల్యాల నుంచి చందుర్తి వెళ్తుండగా మల్యాల గ్రామంలోని కల్వర్టు వద్ద ఎదురెదురుగా ఢీకొన్నారు. గాయపడ్డ వారిని చికిత్స నిమిత్తం వేములవాడలోని ఏరియా దవాఖానకు తరలించారు. గంగాధర్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిపారు.

బెదిరింపులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి

- తంగళ్లపల్లి ఠాణాలో బీఆర్ఎస్ నేతల ఫిర్యాదు

పోలీస్ స్టేషన్ ఎదుట మండలాధ్యక్షుడు రాజన్న, బీఆర్ఎస్ నేతలు

సిరిసిల్ల రూరల్, మార్చి 8 : బీఆర్ఎస్ సీనియర్ నేత, జిల్లెల్ల మాజీ సర్పంచ్ మాట్ల మధును ఫోన్‌లో బెదిరించిన వారిపై చర్యలు తీసుకోవాలని శనివారం తంగళ్లపల్లి ఠాణాలో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. మధుకు ఫోన్ చేసి బూతులు తిట్టి చంపుతానన్నని బెదిరించిన వ్యక్తులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలన్నారు. ఇక్కడ బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రాజన్న, సింగిల్‌విండో చైర్మన్ బండి దేవదాస్‌గౌడ్, మాట్ల మధు, జక్కుల నాగరాజుయాదవ్, బండి జగన్, మల్లారపు నరేశ్, ఏసిరెడ్డి రాంరెడ్డి, శ్రీకాంత్‌రావు, రాజయ్య, మహేశ్, అబూబకర్, రమేశ్, మీ సాల కృష్ణ, సతీశ్‌రెడ్డి, అవదూత మహేందర్, గుండు ప్రేమ్‌కుమార్, చక్రపాణి, ఎల్లయ్య, ఆ త్మకూరి చంటి, బాలయ్య, తిరుపతి, నవీన్‌రెడ్డి, శ్రీధర్, యాద నరేశ్, సురభి నవీన్‌రావు ఉన్నారు.

రాజీ ద్వారానే సమస్యలు పరిష్కారం

- జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి జ్యోతిర్మయి
- లోక్‌అదాలతో రాజీపడిన దంపతులకు సన్మానం

వేములవాడ కోర్టులో రాజీపడిన దంపతులు వెంకటి వినోదను సన్మానిస్తున్న న్యాయమూర్తి జ్యోతిర్మయి, న్యాయవాదులు, పోలీసులు

వేములవాడ, మార్చి 8: రాజీ ద్వారానే సమస్యలు పరిష్కారానికి వేదికవుతాయని వేములవాడ జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి జ్యోతిర్మయి అన్నారు. శనివారం వేములవాడలో మెగా లోక్‌అదాలత్ సందర్భంగా వేములవాడ పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వెంకటి–వినోద దంపతులు కేసు విషయంలో రాజీపడిన సందర్భంగా న్యాయమూర్తి జ్యోతిర్మయి వారిని సత్కరించి సన్మానించారు. కక్షిదారులు ఆవేశాలకు లోను కాకుండా సమస్యలు సామరస్యంగా పరిష్కరించుకోవడానికి కృషిచేయాలని సూచించారు. మెగా లోక్‌అదాలత్‌లో మొత్తం 1065 కేసులు పరిష్కారమయ్యాయని తెలిపారు. ఇక్కడ వేములవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుడిసె సదానందం, ఏజీపీలు బోడ్డు ప్రశాంత్‌కుమార్, పుప్పాల భాను కృష్ణ, ఏవీపి విక్రాంత్ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అవదూత రజనీకాంత్, న్యాయవాదులు, సీఐలు, తదితరులున్నారు.

ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియపరచటం ఏమనగా నా క్లయింట్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, వేములవాడ శాఖ గారు. శ్రీ మచ్చ బ్రహ్మానందం, S/o బాలకిషన్, R/o. అనంతారం గ్రామం, ఇల్లంతకుంట మండలం, రాజన్న సిరిసిల్ల జిల్లా గారికి వ్యాపార నిమిత్తం ఋణ సదుపాయం కల్పించుచున్నారు. ఇట్టి విషయములో తన యొక్క స్వంత ఆస్తి అయిన రేకుల ఇల్లు H.No. 1-90 మరియు దీని యొక్క ఖాళీస్థలం మొత్తం విస్తీర్ణం: 143.5 చ.గజాలు, అనంతారం గ్రామం, ఇల్లంతకుంట మండలం, రాజన్న సిరిసిల్ల జిల్లాలో గల దానిని నా క్లయింట్‌కు పై ఋణ విషయములో తనఖాగా పెట్టి పై ఆస్తికి సంబంధించిన ఒరిజినల్ దస్తావేజులు అప్పగించినారు. కావున ఇట్టి ఆస్తిపై ఎవరికైనా ఎలాంటి హక్కులు కానీ ఆక్షేపనలు కానీ వ్యాజములు ఉన్నచో ఈ ప్రకటన వెలువడిన 7 దినములలోగా తగు దస్తావేజులతో నా కార్యాలయమునకు వచ్చి సంప్రదించగలరు. లేనిచో ఎవరికి అభ్యంతరాలు లేవని ధృవీకరించబడును.

తేది: 08-03-2025 స్థలము: సిరిసిల్ల.

ఇట్లు: Sd/- సి.హెచ్. మహేశ్ గౌడ్
న్యాయవాది బి.ఎస్సి., ఎల్.ఎల్.బి.,
సిద్ధార్థనగర్, సిరిసిల్ల, జి॥ రాజన్న సిరిసిల్ల.

అగ్ని ప్రమాదంలో యువకుడికి గాయాలు

- చికిత్స పొందుతూ మృతి

ఎల్లారెడ్డిపేట, మార్చి 8: తల్లి ఊరెళ్లిందని వంట చేస్తుండగా, కండ్లు తిరిగి గ్యాస్‌స్టాపై పడడంతో యువకుకి గాయాలయ్యాయి. అతడిని హైదరాబాద్‌లోని గాంధీ హాస్పిటల్‌లో చేర్పించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం, రాజన్నపేటకు చెందిన నమిలికొండ ఎల్లయ్య–రాజవ్వ దంపతులకు నూతన్(28), నరేశ్(24) ఇద్దరు కుమారులున్నారు. ఎల్లయ్య పదేండ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందగా తల్లి రాజవ్వ ఇద్దరు కుమారులను కూలీ పనిచేసి పోషిస్తోంది. జనవరి 8న రాజవ్వ పొరుగూరికి వెళ్లగా ఆమె పెద్ద కొడుకు నూతన్ వంట చేసేందుకు ఉపక్రమించాడు. ఈ క్రమంలో కళ్లు తిరిగి మండుతున్న స్టాపై పడడంతో గాయాలలయ్యాయి. అతడిని చికిత్స కోసం గాంధీ హాస్పిటల్‌కు తరలించారు. రెండు నెలలుగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు.

నూతన కార్యవర్గం ఎన్నిక

సిరిసిల్ల టౌన్, మార్చి 8: తెలంగాణ రక్షణ సమితి (డెమొక్రటిక్) నూతన కార్యవర్గాన్ని నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు నరాల సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీఆర్ఎస్(డీ) నూతన జిల్లా అధ్యక్షుడిగా గుంటుక సంపత్‌ను నియమిస్తూ ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోడేటి శంకర్‌గౌడ్, డాక్టర్ వాసంపల్లి ఆనంద్‌బాబు, తదితరులున్నారు.

గ్రామస్తుల సహకారంతోనే రహదారి మరమ్మతు

బోయినపల్లి (వేములవాడ), మార్చి 8: ‘మా ఊరిని రోడ్డును బాగు చేయించండి’ అంటూ అధికారులు, నాయకులకు చెప్పి విసిగిపోయిన గ్రామస్తులు చివరకు వారే మరమ్మతు చేయించుకున్నారు. బోయినపల్లి మండలం గుండన్నపల్లి గ్రామంలోని కాటన్ జిన్నింగ్ మిల్లు మీదుగా చెరువు వద్ద నుంచి గ్రామానికి చేరుకునే రోడ్డు పూర్తిగా చెడిపోయింది. కంకరతేలి నడువడానికి ఇబ్బందిగా మారింది. గ్రామానికి చెందిన శ్రీరామ హిందూ సేవా సమితి ఆధ్వర్యంలో దాదాపు రూ.30 వేలు వెచ్చించి రహదారిని బాగు చేసుకున్నారు.

కూలిన కూరగాయల వ్యాపారుల షెడ్లు

వేములవాడ, మార్చి 8: వేములవాడ పట్టణంలోని రెండో బైపాస్ రహదారిలో తమ కూరగాయల షెడ్లు గుర్తుతెలియని వాహనాలు ఢీకొట్టడంతో కూలిపోయాయని బాధితులు వాపోయారు. శుక్రవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు దాదాపు పదుల సంఖ్యలో షెడ్లు వాహనాలు ఢీకొట్టడంతో నష్టపోయామని వ్యాపారులు శనివారం వాపోయారు. కూరగాయలు అమ్ముకొని జీవనోపాధి పొందుతున్న మాకు వ్యాపారానికి, జీవితానికి కూడా రక్షణ కల్పించేలా చర్యలు తీసుకోవాలని బాధిత వ్యాపారులు గుంటి లక్ష్మణ్, సుంకపాక దేవమ్మ, గుండం దేవమ్మ, పద్మ తదితరులు కోరారు.

మందుబాబులకు జరిమానా

ఎల్లారెడ్డిపేట, మార్చి 8: మండలంలో పలుచోట్ల తనిఖీలు నిర్వహిస్తుండగా మద్యం తాగి వాహనాలు నడిపిన పది మందిని కోర్టులో హాజరు పరుచగా న్యాయమూర్తి ఒక్కొక్కరికి రూ.వెయ్యి జరిమానా విధించినట్లు ఎస్ఐ రమాకాంత్ శనివారం తెలిపారు. అలాగే బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిన 11 మందికి కూడా ఒక్కొక్కరికి రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించినట్లు ఎస్ఐ చెప్పారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ రమాకాంత్ హెచ్చరించారు.

శాంతిభద్రతల పరిరక్షణే ప్రధాన లక్ష్యం

- మహేశ్ బాబాసాహెబ్ గిటె
- ఎస్పీగా బాధ్యతల స్వీకరణ

బాధ్యతలు స్వీకరిస్తున్న మహేశ్ బాబా సాహెబ్ గిటె

వీడ్కోలు సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

రాజన్న సిరిసిల్ల, మార్చి 8 (నమస్తే తెలంగాణ) : శాంతి భద్రతలే పోలీసుల ప్రధాన లక్ష్యమని ఎస్పీ మహేశ్ బాబా సాహెబ్ గిటె అన్నారు. జిల్లా ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ములుగు జిల్లా నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చిన ఆయన శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, సామాన్య ప్రజలకు భరోసా కలిగించే విధంగా పోలీసింగ్ పనిచేస్తుందని తెలిపారు. శాంతి భద్రతల విషయంలో కఠినంగా ఉంటామని, విఘాతం కలిగించే వారిని ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన ఆయనను జిల్లా పోలీసు అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం పలికారు.

ప్రజలకు చేరువై ఉత్తమ సేవలందించాలి

వీడ్కోలు సమావేశంలో ఎస్పీ అఖిల్ మహజన్ పిలుపు

ప్రజలకు మరింత చేరువై ఉత్తమ సేవలందించాలని ఎస్పీ అఖిల్ మహాజన్ సిబ్బందికి పిలుపునిచ్చారు. ఎస్పీగా ఇక్కడ పనిచేసిన ఆయన ఆదిలాబాద్ జిల్లాకు బదిలీపై వెళ్తున్న సందర్భంగా నూతనంగా వచ్చిన ఎస్పీ మహేశ్ బాబా సాహెబ్ గిటె ఆధ్వర్యంలో వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. జిల్లా ప్రజలకు సేవలందించిన ఆయనను సిబ్బంది, అధికారులు ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, రెండు సంవత్సరాలుగా జిల్లాలో పనిచేసే అవకాశం రావడం సంతోషాన్నిచ్చిందన్నారు. సమర్థవంతంగా పనిచేసిన మధుర స్మృతులతో బదిలీపై వెళ్లడం తనకెంతో ఆనందంగా ఉందంటూ ఆయన భావోద్వేగానికి గురయ్యారు. ఉత్తమ సేవలందించే వారికి ప్రజల్లో మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. తనతో కలిసి అంకిత భావంతో పనిచేసిన అధికారులు, సిబ్బంది, హోంగార్డులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీలు చంద్రశేఖర్ రెడ్డి, మురళీకృష్ణ, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, సిబ్బంది, హోంగార్డులు పాల్గొన్నారు.

వన దహనంపై ఎఫ్ఆర్వో విచారణ

- ‘నమస్తే’ కథనంపై స్పందన
- మనుగడలో ఉన్న మొక్కలపై ఆరా

గుండారంలో అధికారులను వనదహనంపై వివరాలు తీసుకుంటున్న ఎఫ్ఆర్వో

ఎల్లారెడ్డిపేట, మార్చి 8: గుండారం అడవి బుగ్గైన ఘటనపై ఎఫ్ఆర్వో శ్రీహరి ప్రసాద్ విచారణ చేపట్టారు. గుండారంలో అడవి బుగ్గి కథనంపై స్పందించిన ఎఫ్ఆర్వో శనివారం దగ్ధమైన అటవీ ప్రాంతాన్ని సందర్శించి వన దహనానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. దహనంపై వ్యక్తుల ప్రమేయముంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మనుగడలో ఉన్న మొక్కలపై వివరాలు అందించాలని సిబ్బందికి సూచించారు. ఇక్కడ ఎఫ్ఎస్‌వో సకారం నాయక్, సిబ్బంది ఉన్నారు.

బిక్కవాగు బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాలని ధర్నా

ధర్నా చేస్తున్న అనంతారం గ్రామస్తులు

ఇల్లంతకుంట రూరల్, మార్చి 8: అనంతారం బిక్కవాగుపై అసంపూర్తిగా నిర్మించిన బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాలని అనంతారం గ్రామ యువకులు, ప్రజలు శనివారం బ్రిడ్జి వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా యువజన సంఘం సభ్యుడు అక్కెం నాగరాజు మాట్లాడుతూ, ఇల్లంతకుంట మండల కేంద్రం నుంచి జిల్లెల్ల వరకు ఉన్న రోడ్డు ఈ బ్రిడ్జి దాటుకునే వెళ్లాలని, బ్రిడ్జి అసంపూర్తిగా ఉండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాలని